సీఆర్‌ఆర్ మరణం పార్టీకి తీరని లోటు

ఆదిలాబాద్: మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలుకూరి రామచంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సీఆర్‌ఆర్ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట గిమ్మ సంతోష్, డిస్ట్రిక్ట్ మైనారిటీ సెల్ చైర్మన్ షకీల్, కొండూరి రవి, మాజీ కౌన్సిలర్స్ ఓసావార్ సురేశ్, గేడం అశోక్ ఉన్నారు.

మొహర్రం ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి: మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గోండ్‌గూడ మొహర్రం నిర్వహణ కమిటీ సభ్యులకు రూ. 5 వేలు విరాళం అందజేశారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే మొహర్రం ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలన్నారు. గ్రామస్తులు మరప రాజు, పెందోర్ కృష్ణ, ఆత్రం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని అంచనా వేయాలి

ఇంద్రవెల్లి: జిల్లా అధికారులు గ్రామాలను సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేయాలని టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భారత్ చౌహాన్ కోరారు. శనివారం మండలంలోని లాల్‌టెకిడి, హీరాపూర్, జైత్రంతండా గ్రామాల్లో పర్యటించారు. కోతకు గురైన రోడ్లు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, సోయా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాథోడ్ గణేశ్, జాదవ్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

సిరికొండ: మండలంలోని కోండపూర్, సిరికొండ గ్రామంలో దెబ్బతిన్న పంటలను ఏఈవో ప్రవీణ్ పరిశీలించారు. పంట నష్టం నమోదు చేసుకొని అధికారులకు నివేదిస్తానని తెలిపారు. పత్తిలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాన్నారు. ఆయన వెంట రైతుబంధు కోఆర్డినేటర్ అశోక్, రైతులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్‌లో శనివారం వరద బాధిత కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన షాదుల్లా నిత్యావసర సరుకులు అందచేశాడు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి వరద నీరు చేరడంతో తనవంతు సాయంగా పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నాడు.

కూలిన ఇళ్లు

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో కుమ్మరి లక్ష్మి, కుమ్మరి సుధాకర్ ఇల్లు కూలిపోయాయి. దీంతో వంట సామగ్రి, దుస్తులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎంపీడీవో రమాకాంత్ గ్రామానికి చేరుకొని కూలిన ఇళ్లను పరిశీలించారు. అధికారులకు నివేదించి నష్టపరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ పోతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆజౌప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బేల: మండలంలోని మూడు గ్రామాల్లో శనివారం నాలుగు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు మండల తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఆర్‌ఐ నారాయణలు తెలిపారు. కాంఘర్‌పూర్‌లో రెండు ఇళ్లు, అవాల్‌పూర్, తోయగూడ గ్రామాల్లో ఒక్కొక్క ఇల్లు గోడలు కూలిపోయి, నష్టం వాటిల్లిందన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

బజార్‌హత్నూర్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో ఆరు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్పందించిన విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణ ఆధ్వర్యంలో మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏడీ సుబ్రహ్మణ్యం, ఏఈ రవికుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు, లక్ష్మణ్, గణేశ్ పాల్గొన్నారు.

పీవోను కలిసిన టీటీఎఫ్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌ను టీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సీఆర్టీలను న్యాయబద్ధంగా నియమించాలన్నారు. గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్ రాథోడ్, రవినాయక్, సలాం శంకర్, రామారావు, మంగులాల్, బలిరాం, గజేందర్, విజయ్ పాల్గొన్నారు.

సనాతన ధర్మ సమ్మేళన సభ

ఇచ్చోడ: మండలంలోని పట్వారిగూడ రామాలయంలో శనివారం సనాతన ధర్మ సమ్మేళన సభ నిర్వహించారు. వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయన్ మహరాజ్ పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం పఠనం చేయించారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమైన కార్యక్రమం 3 గంటల వరకు సాగింది. దాదాపుగా 1500 మంది భక్తులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

- కొట్టుకుపోయిన వంతెనలు, కోతకు గురైన రోడ్లు
- స్తంభించిన జనజీవనం
- నీటమునిగిన పంట పొలాలు



ఇచ్చోడ: కొట్టుకుపోయిన వంతెనను దాటుతున్న ప్రజలు

తాంసి: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దున ఉన్న పెన్‌గంగ ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో పరీవాహక గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అర్లి(టి) లోతట్టు ప్రాంతాల ప్రజలను సర్పంచ్ వైభవ్, కార్యదర్శి రవికాంత్ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద పరిస్థితిని జెడ్పీ సీఈవో గణపతి, డిప్యూటీ సీఈవో రాజేశ్వర్, ఎంపీడీవో భూమయ్య, జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు పరిశీలించారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి సమీపంలో సాత్నాల వాగు ఉధృతంగా ప్రవహించింది. వాగును చూసేందుకు ఆదిలాబాద్ పట్టణంతో పాటు గ్రామస్తులు తరలివచ్చారు. సాత్నాల వాగు పరివాహక ప్రాంతంలోని పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ పొలాలు చెరువులను తలపించాయి.

ఇంద్రవెల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మామిడిగూడ, చిత్తబట్ట, జైత్రంతండా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లు కోతకు గరయ్యాయి. నిత్యావసర సరుకులకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎస్సై సునీల్ ముత్నూర్ త్రివేణి సంఘం చెరువు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జైనథ్: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలం అతలాకుతలమైంది. పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో మాండగాడ, పిప్పర్‌వాడ, పూసాయి, కమాయి, డొల్లార, ఆనంద్‌పూర్, సాంగ్వి, లేకర్‌వాడ, పెండల్‌వాడ, కూర, కరంజి, దీపాయిగూడ, ఖాప్రి గ్రామాల్లో వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. పూసాయి ఆలయం వరద నీటిలో చిక్కుకుంది.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నర్సాపూర్(జె)వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. ఎంపీపీ జైవంత్‌రావు హీరాపూర్(పి), తేజాపూర్, బలాన్పూర్, దంతన్‌పల్లి, బీర్సాయిపేట గ్రామాల్లో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో బాధితులను పరామర్శించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఇచ్చోడ: వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో వాగు పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి. దాదాపు 1500 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఏవో కైలాస్ తెలిపారు. దూబార్‌పేట్ ఫ్లైఓవర్ కొట్టుక పోవడంతో సిరికొండ మండలానికి వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మండల కేంద్రంలో శివాజీ, అంబేద్కర్ చౌక్‌లలో రోడ్లుపై వరదనీరు నిలిచింది.



జైనథ్: మునిగిన కామాయిరోడ్డు



ఉట్నూర్‌రూరల్: పంటలను పరిశీలిస్తున్న ఎంపీపీ



తాంసి: ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగ



తాంసి: అంతర్రాష్ట్ర కల్వర్ట్‌పై నుంచి ప్రవహిస్తున్న వరద



ఆదిలాబాద్ రూరల్: పంటపొలాల్లో నిలిచిన వరద



ఇంద్రవెల్లి: మత్తడి దుకుతున్న చెరువు



ఆదిలాబాద్ రూరల్: సాత్నాల వాగు ఉధృతి



ఉట్నూర్‌రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

వసతి గృహం విద్యార్థుల తరలింపు



విద్యార్థులను తరలిస్తున్న వార్డెన్ సురేందర్

సాక్షి ఎఫెక్ట్..

తాంసి: మండలంలోని కప్పర్ల ఎస్సీ వసతి గృహంలోని విద్యార్థులను శనివారం మండల కేంద్రంలోని వసతి గృహానికి తరలించారు. శుక్రవారం సాక్షి దిన పత్రికలో 'ఉరుస్తున్న వసతిగృహం' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. శనివారం కప్పర్ల అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నారాయణరెడ్డి వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులను ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సౌకర్యాల కోసం తాంసి మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహానికి తరలించారు. మండల ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో గణపతి, డిప్యూటీ సీఈవో రాజేశ్వర్, ఎంపీడీవో భూమయ్య పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు.

ముందస్తు అరెస్టులు

ఆదిలాబాద్‌రూరల్: గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో మావల మండలంలోని మణిపూర్ కాలనీలో వర్షపునీరు నిలిచింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ రఘుపతి కాలనీ పర్యటనకు వెళ్తుండగా మావల పోలీసులు ఆయనతో పాటు మరికొందరిని ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గుడిహత్నూర్ ఎస్సైగా ఇమ్రాన్

గుడిహత్నూర్: గుడిహత్నూర్ ఎస్సైగా ఇమ్రాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పని చేసిన ఎస్సై ప్రవీణ్ కుమార్ నిజామాబాద్ 3 టౌన్‌కు బదిలీపై వెళ్లారు. శాంతి భద్రతల నిర్వహణలో మండల ప్రజలు సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ బదిలీ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ బదిలీ అయ్యారు. ఐదు నెలల కిందట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు శనివారం రిలీవ్ అయ్యారు.

ఉట్నూర్ ఎస్సైకి పదోన్నతి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న భరత్ సుమన్ సీఐగా పదోన్నతి పొందారు. ఎస్సై భరత్ సుమన్ 2012లో పోలీసుశాఖలో ఎస్సైగా ఉద్యోగం పొందారు. అనంతరం వరంగల్ సిటీ క్రైం బ్రాంచ్, నిర్మల్, లోకేశ్వరం, ముథోల్, నేరడిగొండలో ఎస్సైగా విధుల నిర్వర్తించారు. 2022 నుంచి ఇప్పటి వరకు ఉట్నూర్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఎదులాపురం: మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసి, హత్య చేయడం దారుణమన్నారు. ఘటనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

ఉట్నూర్‌రూరల్: మణిపూర్ నిందితులను ఉరితీయాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉట్నూర్ ఐబీలో మానవహక్కుల వేదిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు ఐబీ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు, మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని శాంతిని నెలకోల్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నేతావత్ రాందాస్, శామ్యూల్, అశ్విని, రాథోడ్ గణేశ్, చంద్రకాంత్, కపిల్, బానోత్ రామారావు, అతీశ్, సూర్, జుబేర్, వెంకటేశ్ పాలొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఎదులాపురం: మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దుర్గమ్మ కళావతి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరిగిన ఘటనను వ్యతిరేకిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భుమన్న మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరిగిన ఘటన ప్రపంచంలోనే అత్యంత దారుణమైందన్నారు.

'జెడ్పీ చైర్మన్ ఇంటిని ముట్టడిస్తాం'



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోడ్డును బాగు చేయకుంటే జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఇంటిని ముట్టడిస్తామని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాథోడ్ భిక్షపతి హెచ్చరించారు. శనివారం నాయకులతో కలిసి రోడ్డుపై నిలబడి నిరసన తెలిపారు. రోగులతో పాటు గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నా.. అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కనీసం అంబులెన్స్ వెళ్లాలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, అక్షయ్, ధర్మ రక్షక్, రణ్వీర్, మహేశ్, కపిల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



పెన్‌గంగ ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామన్న

జైనథ్: అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం అధికారులు, నాయకులతో కలిసి మండలంలోని పెన్‌గంగ నది పరీవాహక గ్రామాల్లో పర్యటించారు. అనంతరం అధికారులకు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవసరమైన సాయం అందించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, సర్పన్ లింగారెడ్డి, మెట్టు ప్రహ్లాద్ ఉన్నారు.

బేల: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మహేందర్‌కుమార్ అన్నారు. శనివారం సాంగిడి, దహిగాం, కాప్సి(బి), అవాల్‌పూర్ గ్రామాల్లో వరద పరిస్థితులను పరిశీలించారు. పాత ఇళ్లలో ఉన్న ప్రత్యామ్నయంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీవో సుమీర్ హైమద్, ఆర్‌ఐలు గీత, నారాయణ ఉన్నారు.

తలమడుగు: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రమాకాంత్, ఎస్సై ధనశ్రీ అన్నారు. ఇంటి నుంచి ఎవరూ బయటకు రావొద్దన్నారు. ఖోడథ్, సుంకిడి, కోత్తూర్, డోర్లి, టోక్కిగూడ, భరంపూర్, అర్లి, లోతట్టు ప్రాంతాల రహదారులపై ప్రయాణం చేయవద్దన్నారు. లోలెవల్ వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఎస్సై సురేందర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గొడుగులకు గిరాకీ



రెయిన్ కోట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



ఆకట్టుకుంటున్న గొడుగు

ఆదిలాబాద్: గత మూడు రోజుల నుంచి వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. దీంతో ప్రజలు బయటకు వెళ్లాకుండా ఇంటికే పరిమితమవుతున్నారు. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు రెయిన్‌కోట్, గొడుగు తప్పనిసరి కావాలి. వర్షంలో తడవకుండా ఉండేందుకు ప్రజలు గొడుగులు, రెయిన్ కోట్స్‌ని కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకొని మార్కెట్లోకి పలు రకాల గొడులుగు, రెయిన్ కోట్స్‌ని అందుబాటులో ఉంచుతున్నారు. నాణ్యమైనవి రూ. 150 నుంచి మొదలుకొని రూ. 800 వరకూ లభిస్తున్నాయి. చిన్నారులు, పెద్దలకు సరిపోయే రెయిన్ కోట్స్ అమ్మకాలు జోరందుకున్నాయి.





విభిన్న రంగులతో ఆకట్టుకుంటున్న గొడుగులు

ఈవీఎం యంత్రాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని దేవాపూర్, పిప్రి గ్రామాల్లోని ప్రజలకు ఈవీఎం యంత్రాలపై అవగాహన కల్పించారు. ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలని సూచించారు. ఓటరు లిస్టులో పేరు చూడడం, యంత్రాల ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవడం గురించి వివరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ గంగాధర్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ మెస్రం లక్ష్మణ్, శీల పాల్గొన్నారు.

నార్నూర్: ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సతీశ్ అన్నారు. శనివారం మండలంలోని నాగల్‌కొండలో ఈవీఎం ద్వారా ఎలా ఓటు వేయాలని వివరించారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ సునీత, నారాయణ పాల్గొన్నారు.

'రథయాత్రకు తరలిరండి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రెజరీ అధికారులు

కైలాస్‌నగర్: ఉట్నూర్‌లో ఈనెల 24న నిర్వహించే రథయాత్రకు సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, రాష్ట్ర సహాధ్యక్షులు సత్యనారాయణ కోరారు. యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం జిల్లా ట్రెజరీ, సబ్‌రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్‌లు హరిక, అశోక్‌కుమార్, పణీందర్‌లు ఆవిష్కరించారు. సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ పి.నరేశ్, ట్రెజరీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.